## క్లుప్తంగా

### నివాళి..



నివాళులర్పిస్తున్న నందిని, నాయకులు

మధిర: వైద్య అవసరాలకు పార్థివదేహాన్ని దానం చేసిన కాంగ్రెస్ నాయకులు పారుపల్లి విజయ్ తల్లి, రిటైర్డ్ ఉపాధ్యాయిని పారుపల్లి విమల చిత్రపటానికి డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని నివాళులర్పించారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా చనిపోయిన తర్వాత కూడా నేత్ర దానంతో పాటు వైద్య అవసరాలకు పార్థివ దేహాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అనిల్ కుమార్ నెహ్రూ, కర్నాటి అశోక్, రంగా శ్రీనివాసరావు, తన్నీరు రామకృష్ణ, తూమాటి నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తల్లాడ: మండలంలోని కుర్నవల్లిలో మృతి చెందిన గుర్రాల సామ్రాజ్యం మృతదేహానికి కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాపా సుధాకర్, అయిలూరి వెంకటకోటారెడ్డి, అన్నెం కోటిరెడ్డి, గంటల వెంకటాచారి, శేషగిరిరావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

### 13న ఇంటర్వ్యూలు

కొణిజర్ల: మండల పరిధిలోని చిన్న మునగాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే పూర్వ ప్రాథమిక విద్య తరగతుల నిర్వహణకు గాను ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు ఈ నెల 13న ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరగాల్సిన ఇంటర్వ్యూలు అనివార్య కారణాలతో నిలిచిపోయినందున 13న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సకాలంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

### బాధ్యతలు స్వీకరించిన సొసైటీ సీఈఓ



బాధ్యతలు స్వీకరిస్తున్న వీరారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ సీఈఓగా ఎస్.వీరారెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సొసైటీ చైర్మన్ అనమోలు సాంబశివరావుకు జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. పలువురు ఆయన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈవోలు ఏసుబాబు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

కొణిజర్ల: మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, గోపవరం సొసైటీ వైస్‌చైర్మన్ నెల్లూరి రమేష్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇసుక టిప్పర్ సీజ్

బోనకల్: ఏపీ నుంచి నుండి తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను బోనకల్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. మండలంలోని చొప్పకట్లపాలెం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో ఈ వాహనం పట్టుబడిందని ఎస్సై పి.వెంకన్న తెలిపారు. ఈ మేరకు టిప్పర్ డ్రైవర్ ఉపేందర్, యజమానులు మక్తవరపు శిఖామణి, బుంగా రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### కేసు నమోదు

చింతకాని: మండలంలోని కోమట్లగూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ విషయమై ఘర్షణలో ఒకరిపై కేసు నమోదైంది. గ్రామానికి చెందిన బొడ్డు రేణుక తన పేరిట ఉన్న స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని చేపట్టింది. దీన్ని ఆమె సోదరుడైన బోజీ అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. ఈమేరకు ఇంటి నిర్మాణానికి తీసిన పునాదులను బోజీ పూడ్చడమే కాక చంపుతానని బెదిరించాడు. దీంతో రేణుక ఫిర్యాదు మేరకు బోజీపై కేసు నమోదు చేశామని ఎస్సై వీరేందర్ తెలిపారు.

# ఎత్తుతగ్గి.. రోడ్డులో కలిసి..

**శిథిలావస్థకు చేరిన డివైడర్లు**

- కల్లూరులో వాహనదారుల ఇక్కట్లు
- తరచూ ప్రమాదాలు





రోడ్డులో కలిసిపోయిన డివైడర్

కల్లూరు: కల్లూరులో సుమారు రెండు కిలోమీటర్ల పొడవు వేసిన డివైడర్లు శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సరైన సూచికలు లేకపోవడం కొత్త రహదారుల నిర్మాణంతో డివైడర్లు ఎత్తు తగ్గి రహదారిలో కలిసిపోవడం ఇందుకు కారణమవుతోంది. తరచుగా వాహనాలు డివైడర్ల ప్రాంతం వద్ద ఢీ కొట్టడమే, పైకి ఎక్కుతుండగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం కల్లూరులోని టీటీడీ కల్యాణ మండపం నుంచి పాత బస్టాండ్ వరకు సుమారు 2 కిలోమీటర్ల పొడవున డివైడర్లు ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ పెట్టారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఎప్పుడో పాడవ్వగా, డివైడర్లు శిథిలావస్థకు చేరాయి. రాత్రి వేళ వాహనదారులు సరిగ్గా కనిపించక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎస్ఐ హరిత ఆధ్వర్యాన తాత్కాలిక పోలీస్ పోస్టు బాక్సులు ఏర్పాటు చేసారు. రేడియం స్టిక్కరింగ్ లేకపోవడంతో వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కన్పించడం లేదు. నేషనల్ హైవే రహదారి కనుక పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. స్థానికులు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కల్లూరుకు కొత్తగా డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

**ప్రమాదాలు జరుగుతున్నాయి**

డివైడర్లు సరిగా లేక వాహనాలు డివైడర్ల పైకెక్కి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో మరీ ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలకు సరైన ప్రమాద సూచికలు లేవు. పోలీసులు స్పందించి కొంత వరకు నివారణ చర్యలు చేపట్టారు. పాత డివైడర్లను తొలగించి కొత్తగా డివైడర్లు ఏర్పాటు చేయాలి. – ఏనుగుల అంజి, కల్లూరు

**రూ. 2.80 కోట్లతో ప్రతిపాదనలు**

కల్లూరు పట్టణంలో శిథిలావస్థకు చేరిన డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ స్థానే నూతనంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి రూ. 2.80 కోట్లు ప్రతిపాదనలు పంపాం. వీటిలో సెంట్రల్ లైటింగ్‌కు రూ.1.80 కోట్లు, డివైడర్లకు రూ. 1 కోటి ప్రపోజల్ పంపించాం. టెండర్ల పూర్తి కాగానే పనులు మొదలు పెడతాం.
– ఏ.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

**నిధులు మంజూరయ్యాయి.. మరమ్మతులు చేయిస్తాం**

ఖమ్మం నుంచి అశ్వారావుపేట నేషనల్ హైవే రోడ్‌కు త్వరలో మరమ్మతులు చేయిస్తాం. మరమ్మతుల కోసం రూ. 15 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తి కాగానే మరమ్మతులు చేయిస్తాం. అందులో కల్లూరులో డివైడర్లు ఉంటాయి.
– కిరణ్, ఎన్‌హెచ్ మేనేజర్

## ఓటు చోరీపై సంతకాలు సేకరణ



సత్తుపల్లిటౌన్: సంతకాల సేకరణలో నాయకులు



సత్తుపల్లి: సంతకం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: టీపీసీసీ పిలుపు మేరకు ఓట్లు చోరీపై నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ గాజులరామావరం డివిజన్‌లో ఎమ్మెల్యే, పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మట్టా రాగమయి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా తారుమారు చేసి ఓటు హక్కును రద్దు చేయాలని కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. అనంతరం డీఎస్పీ ఉద్యోగం సాధించిన గోలి శ్రీనివాసరెడ్డి కుమార్తె హేమవర్షిణిరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూన శ్రీనివాసగౌడ్, బుచ్చిరెడ్డి నరేష్‌గౌడ్, నాయకులు సుబ్బారెడ్డి, నర్సారెడ్డి, బండి సత్యనారాయణరెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: స్థానిక క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ దోమా ఆనంద్‌బాబు, గాదె చెన్నారావు, దూదిపాల రాంబాబు, ఎండి.కమల్‌పాషా, చల్లగుళ్ల నర్సింహారావు, శ్రీను, ప్రసాద్, పింగళి సామేలు, కుమారి, సందీప్‌గౌడ్, చల్లగుండ్ల కృష్ణయ్య, శంకర్‌రావు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని సబ్‌స్టేషన్ టౌన్ –1 ఫీడర్‌లోని జలగంనగర్, వెంగళరావునగర్, వేంసూరురోడ్, బస్టాండ్ కాంప్లెక్స్ పరిధిలో శనివారం ట్రీ కటింగ్ చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు తెలిపారు. సదరు ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పెద్ద కోరుకొండి విద్యుత్‌శాఖ ఏఈ రామిరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దకోరుకొండి, చెన్నూరు, పోచవరం, లింగాల, వెన్నవల్లి, మర్లపాడు, తెలగవరం, తాళ్లూరు, వెంకటాపురం, ఎర్రబోయినపల్లి గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తల్లాడ: మండలంలో సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తల్లాడ, కుర్నవల్లి సెక్షన్ల విద్యుత్ ఏఈలు రాయల ప్రసాద్, దారా కృష్ణకాంత్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. తల్లాడ, కుర్నవల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి 11 వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

## న్యాయమూర్తిపై దాడిని ఖండించాలి





నిరసన చేపడుతున్న నాయకులు

పెనుబల్లి: సుప్రీం సీజేఐ జస్టిస్ బీఆర్.గవాయిపై దాడి ప్రజాస్వామ్య పునాదులపై జరిగిన దాడి అని, ఈ దాడిని భారతీయ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలని న్యాయ వ్యవస్థకు రక్షణ కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు చిట్టిమోదుల కృష్ణ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బాలాజీ, మండల కమిటీ సభ్యుడు తడికమళ్ల చిరంజీవి, తాండ్ర రాజేశ్వరరావు, మల్లెల శ్రీను పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'క్లీన్ అండ్ గ్రీన్'



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జైదాస్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ తొరియా, ఉపేందర్, సాంబయ్య, విక్రమ్, కృష్ణ, నాగరాజు, లాలయ్య, కొండలరావు పాల్గొన్నారు.

### పారిశ్రామిక శిక్షణలో విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్, డిప్లొమో విద్యార్థులు పారిశ్రామిక శిక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు పశ్చిమ గోదావరి జిల్లా మోతుగూడెం మండలంలోని లోయర్ సీలేరు పవర్‌ప్లాంట్‌ను సందర్శించారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇటువంటి పారిశ్రామిక సందర్శనలు అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విభాగాధిపతులు కె.రామకృష్ణ, షేక్ సైదులు, కె.ప్రతీమ, ఎన్‌జివి కృష్ణ తదితరులు ఉన్నారు.

## ఘనంగా అట్లతద్ది వేడుకలు



ఊయల ఊగుతున్న మహిళలు

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అట్లతద్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు, మహిళలు గౌరీ దేవికి పూజలు చేసి అట్లు వాయినంగా పంచి పెట్టారు. పాటలు పాడుతూ ఊయలలు ఊగుతూ వేడుక సంతోషంగా జరుపుకున్నారు.
– ఏన్కూరు



వాయినాలు ఇస్తూ..

## ఆత్మగౌరవంతో కాంగ్రెస్ చెలగాటం



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న రాఘవరావు

సత్తుపల్లిరూరల్: బీసీల ఆత్మగౌరవంతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు అన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల పేరుతో బీసీలకు కాంగ్రెస్ వంచించి చులకన చేసిందని, బీసీలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే మంత్రి మండలిలో 42శాతం బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్, విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ మిశ్రా, సురేందర్‌రెడ్డి, వేముల లక్ష్మీనారాయణ, సాలి శివకృష్ణ, నరేష్, ఎస్‌కె.రహ్మతుల్లా, చీకటి వసంతరావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

**బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన**



ఏన్కూరు: పాఠశాల వద్ద నాయకులు

ఏన్కూరు: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు స్టే ఇచ్చి నిలిపి వేయడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏన్కూరులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలను మూసి వేయించి బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నారాయణ ఆశయాలు కొనసాగిస్తాం



మాట్లాడుతున్న నాగూర్‌వలి

మధిర: ఉపాధ్యాయ ఉద్యమానికి విశిష్ట సేవలు అందించిన నాగటి నారాయణ ఆశయాలను కొనసాగిస్తామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్‌వలి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, వీరయ్య అన్నారు. మధిర యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నారాయణ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జరిగిన మండల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమానికి ఆయన దిక్సూచిగా పనిచేశారని, విద్యారంగ అభివృద్ధికి నారాయణ పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ఉపాధ్యాయ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇబ్రహీం, చెన్నయ్య, రాజు, రఫీ, లాల్ అహ్మద్, నాగేశ్వరరావు, రమేష్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక నుంచి సమ్మె ఉధృతం చేస్తాం





సమ్మె శిబిరంలో హాస్టళ్ల వర్కర్లు, మాట్లాడుతున్న విఠల్

సత్తుపల్లిటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన హాస్టల్ వర్కర్లు తలపెట్టిన సమ్మె ఇకపై ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ అన్నారు. ఈ మేరకు సత్తుపల్లిలో వర్కర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం 29వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమస్యలు పరిష్కరించే వరకు కార్మికులకు అండగా నిలుస్తామన్నారు. నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, సుశీల, రాఘవమ్మ, లక్ష్మీ, పద్మ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, పార్వతి పాల్గొన్నారు.

### మహాసభను విజయవంతం చేయాలి

తల్లాడ: మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ జిల్లా రెండో మహాసభ శనివారం తల్లాడలో నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ తెలిపారు. తల్లాడ జీఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగే సభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు సభను విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

### విద్యుదాఘాతంతో తీవ్రగాయాలు

వేంసూరు: మండలంలోని దుద్దెపూడికి చెందిన వ్యక్తి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జంజునూరి వెంకటేశ్వరరావు ఓ రైతుకు చెందిన పొలం మోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో శుక్రవారం స్తంభం ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ సరిచేస్తున్నాడు. ఈ క్రమాన షాక్‌కు గురైన ఆయన కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో 108లో సత్తుపల్లి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం, ఖమ్మంకు ఆపై హైదరాబాద్ తరలించారు.

### నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'యువ వికాస్' అంశంపై ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో చదువుతున్న విద్యార్థులకు సెమినార్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ డాక్టర్ సిహెచ్.శివప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి యువతలో నాయకత్వ గుణాలు, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పెరగాలన్నారు. సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావుతోపాటు లయన్స్‌క్లబ్ బాధ్యులు మందపాటి ప్రభాకర్‌రెడ్డి, ప్రెసిడెంట్ గోగడ రమేష్, సెక్రటరీ ఎంఎస్ఎస్‌వి రమణ, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు

# వీధి కుక్కలకు వింతవ్యాధి!

- కరిస్తే ఏమవుతుందోనని ఆందోళనలో గ్రామస్తులు
- నానాటికీ పెరుగుతున్న కుక్కల బెడద
- నియంత్రించాలని వేడుకోలు



వీధిలో సంచరిస్తున్న కుక్కల గుంపు

సత్తుపల్లిరూరల్: మండలంలోని వివిధ గ్రామాలలో వీధికుక్కలకు వింత వ్యాధి సోకటంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పాఠశాలల విద్యార్థులు బడిబాట పట్టాలంటే ఏ కుక్క కాటు వేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో చికెన్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడే పారేయడంతో వాటిని తింటున్న వీధి కుక్కలు అలర్జీతో బాధపడుతున్నాయి. ఈ మేరకు గంగారం, రామానగరం, సత్తుపల్లి పట్టణంలోని గాంధీనగర్, బైపాస్‌రోడ్, శ్రీనివాస టాకీస్‌రోడ్, మసీద్‌రోడ్, తుమ్మూరురామారావు వీధి, జవహర్‌నగర్, వేంసూరు మండలం కందుకూరు, వెంకటాపురం గ్రామాల్లో వీధికుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి.

**బిక్కుబిక్కుమంటూ...**

చిన్నారులు వీధి కుక్కల సంచారంతో రోడ్డుపైకి వచ్చే పరిస్థితి కన్పించటం లేదు. ఎప్పుడు ఏ కుక్క వచ్చి పిల్లలపై దాడి చేస్తాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీధి కుక్కలను అరికట్టే విషయంలో అధికారులు శ్రద్ధ పెట్టక పోవటంతోనే పరిస్థితి నెలకొంది. పదుల సంఖ్యలో రోడ్లపై సంచరిస్తూ వచ్చే పోయే వారిపై వెంటపడి కరుస్తుండటం కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలలో వెళ్లేవారిని సైతం వెంబడిస్తున్నాయి. కుక్కలు వెంబడించటంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడిపోయి తీవ్రగాయాలైన ఘటనలున్నాయి.

**అంటువ్యాధులు సోకి..**

గ్రామాలు, పట్టణాల్లో చికెన్, మటన్ షాపుల యజమానులు ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలు వేస్తుండటంతో వీటిని కుక్కలు తిని కొన్ని రోజులకు అంటు వ్యాధులు సోకుతున్నాయి. ఈ వ్యాధి భారిన పడిన కుక్కలు మనుషులను కరిస్తే ఎంత ప్రమాదమో ఆ కుక్కలను చూస్తుంటేనే భయంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. పలు వీధి కుక్కలు ఈ అంటు వ్యాధులు వ్యాపించి తీవ్రమైన ఎలర్జీ వ్యాధి బారిన పడుతున్నాయి. దీనిపై పంచాయతీ అధికారులు, పట్టణాలలో మండల స్థాయి అధికారులు దృష్టి సారించకపోవటం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



వింత వ్యాధి సోకిన కుక్క

**విచ్చలవిడిగా తిరుగుతున్నాయి..**



సత్తుపల్లి మండలంలో వీధి కుక్కలు విచ్చల విడిగా సంచరిసున్నా.. విద్యార్థులు, చిన్నపిల్లలపై దాడులు చేసి కరుస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు అధికారులు సైతం పట్టించుకోవటం లేదు. ఇప్పటికైన వీధి కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నాం.
– శ్రీరామ వెంకటేశ్వరరావు, గంగారం, సత్తుపల్లి మండలం

**కరిస్తే ప్రమాదమే..**



వీధి కుక్కలు కరిస్తే ప్రమాదమే.. అందులోను ఎలర్జీ వ్యాధి సోకిన కుక్కలు కరిచినా.. వాటి లాలాజం శరీరంలోకి ప్రవేశించిన ప్రమాదమే. కుక్కలు కరిస్తే వెంటనే ప్రాథమిక చికిత్స చేయించుకొని, టీకా వేయించుకోవాలి. కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించాలి.
– కొంగల ప్రదీప్‌కుమార్, వెటర్నరీ సహాయ సంచాలకులు, సత్తుపల్లి